

విభారి

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి

రి.నెం.119/2015

ఆళ్లగడ్డ, కర్నూలు జిల్లా

ఉచిత కళ్యాణ మండపం | ప్రతిభ ఉపాధి శిక్షణ

ఉచిత రక్తదానము | ఉచిత వ్యాధి నిర్ధారణ

ఉచిత కంప్యూటర్ శిక్షణ

సంప్రదించవలసిన చిరునామా

ఆవుల విజయభాస్కర రెడ్డి

ఆళ్లగడ్డ

9440232308,9494498787

ఎడిటర్ : ఆవుల విజయభాస్కర్ రెడ్డి ప్రచురణ:-నంద్యాల, కర్నూల్. విజయవాడ, హైదరాబాద్, సంపుటి-08 సంచిక-129 పేజీలు- 8 వేల -3

మంగళవారం 10-11-2026

రూ.500 నోట్లను రద్దు చేయాలి..

- రూ.100, రూ.200 నోట్లను మాత్రమే చలామణిలో ఉంచాలన్న చంద్రబాబు
- స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఓట్ల శాతం పెరిగిందని వెల్లడి
- 2024 ఎన్నికల కంటే 3.6 శాతం పెరిగి 58.9 శాతానికి చేరిందన్న సీఎం
- రాష్ట్రవ్యాప్తంగా 659 జడ్పీటీసీ స్థానాలకు గాను 575 స్థానాలను కూటమి గెలుచుకుందని వెల్లడి



దేశంలో రూ.500 నోట్లను రద్దు చేయాలంటూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం మరోసారి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మార్కెట్‌లో కేవలం రూ.100, రూ.200 విలువ కలిగిన కరెన్సీ నోట్లను మాత్రమే చలామణిలో కొనసాగించాలని ఆయన పేర్కొన్నారు. గతంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి డిజిటల్ కరెన్సీపై సమర్పించిన నివేదికను ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.

అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ.. పెద్ద నోట్లను రద్దు చేయాలనే అంశంపై తాను నిరంతరం మాట్లాడుతుంటానని స్పష్టం చేశారు. "రూ.500, రూ.1,000, రూ.2,000 నోట్లను పూర్తిగా రద్దు చేయాలి. కేవలం రూ.100, రూ.200 నోట్లను మాత్రమే ఉంచాలి" అని ఆయన డిమాండ్ చేశారు. పెద్ద నోట్ల రద్దుతో నగదు వినియోగాన్ని నియంత్రించి, డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించడం ద్వారా అవినీతిని సమర్థవంతంగా అరికట్టవచ్చని సీఎం అభిప్రాయపడ్డారు. సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిస్తే సంపద సృష్టి, పేదరిక నిర్మూలన కష్టమేమీ కాదని ఆయన పేర్కొన్నారు.

మిగతా 2లో

ఇరాన్‌పై మరోసారి దాడి చేస్తారా?

ట్రంప్ సమాధానం ఇదే..

- ఇరాన్‌పై కొత్త దాడులు జరిగే అవకాశం తక్కువన్న ట్రంప్
- అణు ఒప్పందం, హర్మూజ్ జలసంధిపై చర్చలు కీలకమని వ్యాఖ్య
- మూడు విమాన వాహక నౌకలు యుద్ధానికి సిద్ధంగా ఉన్నట్లు వెల్లడి
- ఉద్రిక్తతల తగ్గింపునకు గల్ఫ్ దేశాల దౌత్య ప్రయత్నాలు



ఇరాన్‌పై మరోసారి యుద్ధం చేయాల్సిన అవసరం రాకపోవచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అభిప్రాయపడ్డారు. అణు కార్యక్రమం, హర్మూజ్ జలసంధి పునఃప్రారంభంపై చర్చలు సానుకూలంగా సాగితే కొత్తగా సైనిక దాడులు చేసే అవకాశాలు చాలా తక్కువని చెప్పారు. అయితే అమెరికాతో బలమైన ఒప్పందానికి ఇరాన్ అంగీకరించకపోతే మాత్రం మరోసారి సైనిక చర్యలకు వెనుకాడబోమని హెచ్చరించారు. సీఎన్ఎన్‌కు ఆదివారం ఇచ్చిన 20 నిమిషాల ఫోన్ ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. చర్చలు ముందుకు సాగితే యుద్ధం అవసరం ఉండకపోవచ్చని పలుమార్లు స్పష్టం చేశారు. ఇప్పటికే ఇరాన్‌పై అమెరికా సైనికంగా, ఆర్థికంగా తీవ్ర ప్రభావం చూపిందని పేర్కొన్నారు. ఇరాన్‌లో ద్రవ్యోల్బణం 301 శాతానికి చేరిందని వ్యాఖ్యానించారు.

మిగతాది 2లో

లోకేశ్ ఆదేశాలతోనే వైసీపీ నేతలపై

తప్పుడు కేసులు!

- గుంటూరు జైల్లో లేళ్ల అప్పిరెడ్డిని ములాఖత్‌లో పరామర్శించిన అంబటి రాంబాబు
- కూటమి సర్కారు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని మాజీ మంత్రి ఆరోపణ
- చిన్న ఘటనను అడ్డం పెట్టుకుని కుట్రపూరితంగా జైలుకు పంపారని మండిపాటు



కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని... ఇందులో భాగంగానే వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిపై అక్రమ కేసులు బనాయించారని ఆ పార్టీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతోనే రాష్ట్రంలో ప్రతిపక్ష నేతలపై తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. గుంటూరు జైల్లో రిమాండ్‌లో ఉన్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిని అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ తలశిల రఘురాం,

మిగతాది 2లో

బంగ్లాదేశ్ తిరిగెళ్లేందుకు షేక్ హసీనా

తొలి అడుగు..

- షేక్ హసీనా తిరిగి స్వదేశానికి వెళ్లేందుకు ప్రయత్నాలు
- కొత్త పాస్‌పోర్టు, జాతీయ గుర్తింపు కార్డు కోసం దరఖాస్తు
- ఢిల్లీలోని బంగ్లాదేశ్ రాయబార కార్యాలయానికి ఆమె తరఫు న్యాయవాదుల లేఖ
- హసీనాకు మరణశిక్ష విధించిన బంగ్లా ప్రత్యేక కోర్టు



భారత్‌లో ఉంటున్న బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా తిరిగి స్వదేశానికి వెళ్లేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. డిసెంబర్‌లో బంగ్లాదేశ్‌కు చేరుకోవాలన్న

పట్నం నరేందర్‌రెడ్డిని

అక్రమంగా అరెస్ట్ చేశారు: కేటీఆర్

- కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- పార్టీ కార్యకర్త అంత్యక్రియలకు వెళుతుండగా పరిగి వద్ద అడ్డుకున్న వైనం
- రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో ముందస్తుగా అరెస్టు చేసినట్లు వెల్లడి





కొడంగల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నేత పట్నం నరేందర్‌రెడ్డి అరెస్టును ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. పార్టీ కార్యకర్త అంత్యక్రియలకు హాజరయ్యేందుకు వెళుతున్న నాయకుడిని పోలీసులు అక్రమంగా అదుపులోకి తీసుకోవడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని ఆయన మండిపడ్డారు. వికారాబాద్ జిల్లా పరిగి సమీపంలోని బహార్‌పేట్ చౌరస్తా వద్ద పోలీసులు పట్నం నరేందర్‌రెడ్డి వాహనాన్ని అడ్డుకుని ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. ఆయన కోస్గిలో మరణించిన ఓ బీఆర్ఎస్ కార్యకర్త అంత్యక్రియలకు

మిగతాది 2లో

లంచం తీసుకుంటూ

ఏసీబీకి దొరికిపోయిన కీసర ఎస్సై

- చార్జ్‌షీట్ దాఖలు చేసేందుకు రూ.2 లక్షలు లంచం డిమాండ్ చేసిన ఎస్సై
- బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగి ట్రాప్ వేసిన ఏసీబీ అధికారులు
- లంచం డబ్బులు తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ సబ్ ఇన్‌స్పెక్టర్



2028 నాటికి

కొడంగల్ భూములకు కృష్ణా జలాలు

వచ్చే సంక్రాంతి తర్వాత రాష్ట్రవ్యాప్తంగా 'ప్రజాబలం' కార్యక్రమం



- గత ప్రభుత్వ అప్పులు చెల్లిస్తూనే తెలంగాణ అభివృద్ధి
- పాలమూరును కరవు, వలసల నుంచి బయటపడేలా చేస్తాం
- కొడంగల్ అభివృద్ధికి రూ.9,053 కోట్లతో పనులకు శ్రీకారం
- ఎల్‌నినో పరిస్థితులను సమిష్టిగా ఎదుర్కొందాం: సీఎం రేవంత్‌రెడ్డి

కొడంగల్: గత ప్రభుత్వం చేసిన అప్పులను ఒకవైపు చెల్లిస్తూనే, మరోవైపు రాష్ట్రంలోని సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ తెలంగాణను దేశంలోనే అగ్రగామి అభివృద్ధి చెందిన రాష్ట్రంగా నిలబెట్టాలనే సంకల్పంతో పనిచేస్తున్నామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి పునరుద్ఘాటించారు.

గత 70 ఏళ్లుగా తీవ్ర అన్యాయానికి గురైన పాలమూరు జిల్లాను అవకాశం వచ్చినప్పుడు ఎందుకు అభివృద్ధి చేసుకోకూడదని ప్రశ్నించారు. కరవు, వలసలతో వెనుకబడిన పాలమూరు ప్రాంతాన్ని కచ్చితంగా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు.

2028 డిసెంబర్ నాటికి కృష్ణా జలాలు

2028 డిసెంబర్ నాటికి కృష్ణానది జలాలతో కొడంగల్ భూములను తడిపి పచ్చని పంటలు పండించేలా చేయడం తన బాధ్యత అని ముఖ్యమంత్రి చెప్పారు. ఇందుకు పోలేపల్లి ఎల్లమ్మ అమ్మవారిపై ప్రమాణం చేసి మాటిస్తున్నానని పేర్కొన్నారు.

ఎల్‌నినో ప్రభావం, ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో వచ్చే సంక్రాంతి తర్వాత 'ప్రజాబలం' కార్యక్రమాన్ని చేపట్టి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తానని తెలిపారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం పరిధిలోని

మిగతాది 2లో

దీపావళి వేళ ఏపీలో అగ్నిప్రమాదాలు...

- దీపావళి వేళ ఆంధ్రప్రదేశ్‌లో పలుచోట్ల అగ్నిప్రమాదాలు
- గన్నవరంలో ఓ గృహోపకరణాల దుకాణంలో చెలరేగిన మంటలు
- ఆముదాలవలసలో ఆయిల్ గోడౌన్‌పై తారాజువ్వ పడి అగ్నిప్రమాదం
- తెనాలిలో షోరూంపై టపాసులు పడి మూడు ఎలక్ట్రిక్ స్కూటర్ల దగ్ధం



ఆంధ్రప్రదేశ్‌లో దీపావళి వేడుకల వేళ పలుచోట్ల అపశ్రుతులు చోటుచేసుకున్నాయి. బాణాసంచా కారణంగా సంభవించిన అగ్నిప్రమాదాలతో పెద్ద ఎత్తున ఆస్తి నష్టం వాటిల్లింది. ముఖ్యంగా కృష్ణా, శ్రీకాకుళం, గుంటూరు జిల్లాల్లో చోటుచేసుకున్న ఘటనలు తీవ్ర ఆందోళన కలిగించాయి.

ఇరాన్‌పై మరోసారి దాడి చేస్తారా? ట్రంప్ సమాధానం ఇదే..

మరోవైపు అవసరమైతే ఇరాన్‌పై మళ్లీ దాడులు చేసేందుకు అమెరికా సైన్యం సిద్ధంగా ఉందని ట్రంప్ వెల్లడించారు. ప్రస్తుతం పశ్చిమాసియాలో మూడు విమాన వాహక నౌకలు మోహరించి ఉన్నాయని చెప్పారు. అవి పూర్తిస్థాయిలో యుద్ధానికి సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు.

ఇరాన్‌లోని విద్యుత్ కేంద్రాలు, వంతెనలు సహా కీలక మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకున్నట్లు తెలిపారు. తమ వద్ద 38 వంతెనల వివరాలు ఉన్నాయని, గంటలో వాటిని ధ్వంసం చేయగలమని హెచ్చరించారు. అయితే వాటిని నాశనం చేయడం తనకు ఇష్టం లేదన్నారు. తిరిగి నిర్మించుకోవడానికి పదేళ్లు పట్టవచ్చని అభిప్రాయపడ్డారు.

ఇటీవల అమెరికా మధ్యంతర ఎన్నికల్లో ట్రంప్ రిపబ్లికన్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలిన నేపథ్యంలో పశ్చిమాసియాలో దౌత్య ప్రయత్నాలు ఊపందుకున్నాయి. ఉద్రిక్తతలు తగ్గించేందుకు ఖతార్ రాజు షేక్ తమీమ్ బిన్ హమద్ అల్ థానీతో ట్రంప్ చర్చించినట్లు ఖతార్ వెల్లడించింది. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ.. సౌదీ అరేబియా, యూఏఈ, ఒమన్, పాకిస్థాన్ సహా పలు దేశాల ప్రతినిధులతోనూ చర్చలు జరిపారు. అయితే అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో మాత్రం చర్చల్లో తక్షణ పురోగతి కనిపించడం లేదన్నారు. ఇరాన్ డిమాండ్లు ఆమోదయోగ్యం కానివిగా అభివర్ణించారు.

అమెరికా దాడులతో ఇరాన్ వైమానిక రక్షణ వ్యవస్థలు ధ్వంసమయ్యాయని ట్రంప్ పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ దేశం వద్ద కేవలం 10 శాతం క్షిపణి సామర్థ్యం, 15 శాతం డ్రోన్ల సామర్థ్యం మాత్రమే మిగిలాయని అన్నారు. ఆయుధ తయారీ కేంద్రాలు కూడా చాలావరకు దెబ్బతిన్నాయని చెప్పారు. ఇరాన్ ఒప్పందానికి ఆసక్తిగా ఉందని, అందువల్ల మరోసారి యుద్ధం వచ్చే అవకాశం తక్కువేనని ట్రంప్ అభిప్రాయపడ్డారు.

బంగ్లాదేశ్ తిరిగెళ్లేందుకు షేక్ హసీనా తొలి అడుగు..

భారత్‌లో ఉంటున్న బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా తిరిగి స్వదేశానికి వెళ్లేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. డిసెంబర్‌లో బంగ్లాదేశ్‌కు చేరుకోవాలన్న లక్ష్యంతో కొత్త పాస్‌పోర్టు, జాతీయ గుర్తింపు కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు ఢిల్లీలోని బంగ్లాదేశ్ రాయబార కార్యాలయానికి ఆమె తరఫు న్యాయవాదులు లేఖ రాశారు. అయితే హసీనాను స్వదేశానికి రప్పించేందుకు పాస్‌పోర్టు అవసరం లేదని, భారత్ ఆమెను అప్పగించాలని బంగ్లాదేశ్ ప్రభుత్వం పట్టుబడుతోంది. దీంతో ఈ వ్యవహారం మరోసారి ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన చర్చకు దారితీసింది. రాయిటర్స్ కథనం ప్రకారం.. హసీనా తరఫు న్యాయవాదులు సోమవారం ఢిల్లీలోని బంగ్లాదేశ్ రాయబార కార్యాలయానికి లేఖ పంపారు. గతంలో ఆమె పాస్‌పోర్టు, జాతీయ గుర్తింపు కార్డులను బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం రద్దు చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కొత్త పత్రాలు జారీ చేయాలని కోరారు. వీలైనంత త్వరగా దరఖాస్తును పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. 2024 ఆగస్టులో విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో అధికారం కోల్పోయిన తర్వాత హసీనా భారత్‌కు వచ్చారు. అప్పటి నుంచి ఆమె ఇక్కడే ఉంటున్నారు. హసీనాకు కొత్త పాస్‌పోర్టు జారీ చేయాల్సిన అవసరం లేదని బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ సహాయ మంత్రి హుమాయున్ కబీర్ స్పష్టం చేశారు. భారత్‌తో ఉన్న ఒప్పందం ప్రకారం ఆమెను తమకు అప్పగించాలని కోరారు. మరోవైపు న్యాయశాఖ మంత్రి ఎం.డి. అసదుజ్జమాన్ కూడా ఇదే వైఖరిని వెల్లడించారు. ఈ ప్రక్రియ చట్టబద్ధంగా సాగుతుందని తెలిపారు. 2024లో నిరసనల అణచివేతకు సంబంధించిన మానవత్వానికి వ్యతిరేక నేరాల కేసులో బంగ్లాదేశ్ ప్రత్యేక న్యాయస్థానం 2025 నవంబరులో హసీనాను దోషిగా నిర్ధారించి మరణశిక్ష విధించిన విషయం తెలిసిందే. ఈ తీర్పును ఆమె తిరస్కరిస్తున్నారు. డిసెంబర్‌లో స్వదేశానికి తిరిగి వెళ్లి కోర్టు ఎదుట లొంగిపోవాలన్నది ఆమె ప్రణాళిక. ఈ పరిణామం భారత్-బంగ్లాదేశ్ సంబంధాలపైనా ప్రభావం చూపే అవకాశముంది.



లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికిపోయిన కీసర ఎస్సై

హైదరాబాద్ లోని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలోని కీసర పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఒక కేసుకు సంబంధించి చార్జ్‌షీట్ దాఖలు చేయడానికి బాధితుడి నుంచి రూ.2 లక్షలు తీసుకుంటుండగా అధికారులు ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఒక కేసుకు సంబంధించి చార్జ్‌షీట్ వేయాలని బాధితుడు ఎస్సై శ్రీనివాస్‌ను కోరారు. ఇందుకు ప్రతిఫలంగా ఎస్సై రూ.2 లక్షల నగదు లంచంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంత పెద్ద మొత్తం ఇవ్వలేకపోయిన బాధితుడు చివరకు ఏసీబీ అధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగారు. ఈ ఉదయం శిల్పా నగర్ వద్ద బాధితుడి నుంచి ఎస్సై శ్రీనివాస్ రూ.2 లక్షల నగదును లంచంగా తీసుకుంటుండగా ఏసీబీ బృందం ఆయన్ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది. ఆయన వద్ద నుంచి నగదును స్వాధీనం చేసుకుని, తదుపరి విచారణ చేపట్టారు. కీసర పోలీస్ స్టేషన్‌లో కొద్ది నెలల వ్యవధిలోనే ఇలాంటి అవినీతి ఘటన మరోసారి వెలుగుచూడటం పోలీస్ శాఖలో తీవ్ర చర్చనీయాంశమైంది. గతంలోనూ స్టేషన్ బెయిల్ కోసం రూ.5 లక్షలు డిమాండ్ చేస్తూ ఇక్కడి ఇన్‌స్పెక్టర్ ఏసీబీకి పట్టుబడిన సంగతి తెలిసిందే. ఆ ఘటన మరువకముందే తాజాగా మరో ఎస్సై లంచం తీసుకుంటూ దొరికిపోవడంతో స్థానికంగా కలకలం రేగింది. పట్టుబడిన ఎస్సై శ్రీనివాస్‌ను ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నారు.

రూ.500 నోట్లను రద్దు చేయాలి..

ఇటీవల ముగిసిన ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీయే కూటమి.. ధన బలాన్ని పూర్తిగా నియంత్రించగలిగిందని చంద్రబాబు తెలిపారు. ఈ ఎన్నికల ఫలితాలు కేవలం కూటమి విజయాన్ని మాత్రమే కాకుండా మంచి పాలన, సామాజిక న్యాయం, నూతన నాయకత్వం, ప్రజాస్వామ్య విలువల పట్ల ప్రజలకున్న విశ్వాసానికి నిదర్శనమని చెప్పారు. 2024 సార్వత్రిక ఎన్నికలతో పోలిస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీయేకు ప్రజా మద్దతు మరింత పెరిగిందని ఆయన వివరించారు.

పట్టణ స్థానిక సంస్థలు, పరిషత్ ఎన్నికలు రెండింటినీ కలిపి ఎన్డీయే కూటమికి 58.9 శాతం ఓట్లు వచ్చాయని చంద్రబాబు వెల్లడించారు. 2024 ఎన్నికల్లో వచ్చిన 55.3 శాతం ఓట్లతో పోలిస్తే ఇది 3.6 శాతం పెరిగిందన్నారు. ఇదే సమయంలో వైసీపీ ఓట్ల శాతం 39.81 శాతం నుంచి 33.56 శాతానికి పడిపోయిందని, అంటే 6.25 శాతం తగ్గిందని చెప్పారు. ఫలితంగా స్థానిక సంస్థల పోరులో కూటమికి, వైసీపీకి మధ్య ఓట్ల తేడా 25.34 శాతంగా నమోదైందని వివరించారు.

పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీయే కూటమి 59.9 శాతం ఓట్లు సాధించగా, వైసీపీకి కేవలం 34.3 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయని సీఎం తెలిపారు. పట్టణాల్లో కూటమి ఏకంగా 94 శాతం స్ట్రైక్ రేట్ సాధించిందన్నారు. జడ్పీటీసీ ఎన్నికల్లో కూటమికి 57.6 శాతం, వైసీపీకి 39.7 శాతం ఓట్లు దక్కగా.. కూటమి 87.5 శాతం స్ట్రైక్ రేట్ నమోదు చేసిందని చెప్పారు. కూటమికి, వైసీపీకి మధ్య ఓట్ల వ్యత్యాసం పట్టణాల్లో 25.6 శాతంగా, గ్రామీణ ప్రాంతాల్లో 17.9 శాతంగా ఉందని తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 659 జడ్పీటీసీ స్థానాల్లో కూటమి ఏకంగా 575 స్థానాలను కైవసం చేసుకుందని ముఖ్యమంత్రి చెప్పారు. మొత్తం 28 జిల్లాల్లో 27 జిల్లాల్లో కూటమి పూర్తి ఆధిపత్యం సాధించిందని, ఒక్క అల్లూరి సీతారామరాజు జిల్లాలో మాత్రమే వైసీపీ అధిక జడ్పీటీసీ స్థానాలు గెలుచుకుందని పేర్కొన్నారు. ఏడు జిల్లాల్లో వైసీపీ ఒక్క జడ్పీటీసీ సీటును కూడా గెలవలేకపోయిందని వివరించారు. అలాగే, 9,818 ఎంపీటీసీ స్థానాల్లో కూటమి 7,803 స్థానాలను గెలుచుకుందని, రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 90 శాతం మండల పరిషత్ అధ్యక్ష పదవులు కూటమికే దక్కనున్నాయని తెలిపారు.

పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కూటమి తిరుగులేని ఆధిక్యాన్ని ప్రదర్శించిందని చంద్రబాబు పేర్కొన్నారు. మొత్తం 100 మేయర్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పదవుల్లో కూటమి 94 స్థానాలను గెలుచుకుంది. ఇందులో 13 మేయర్ స్థానాల్లో 12 స్థానాలు, 87 ఛైర్‌పర్సన్ స్థానాల్లో 82 స్థానాలు కూటమి ఖాతాలో పడ్డాయి. పార్టీల వారీగా చూస్తే తెలుగుదేశం పార్టీ 70, జనసేన 20, బీజేపీ 4 మేయర్/ఛైర్‌పర్సన్ స్థానాలను దక్కించుకున్నాయి. మొత్తం 3,941 వార్డుల్లో కూటమి 3,233 వార్డులను (82 శాతం) గెలుచుకుంది. 100 పట్టణ స్థానిక సంస్థల్లో 95 చోట్ల కూటమి కౌన్సిల్ మెజారిటీ సాధించగా, 16 మున్సిపాలిటీల్లోని అన్ని వార్డులనూ క్లీన్ స్వీప్ చేసింది. మరోవైపు, వైసీపీ కేవలం నాలుగు పట్టణ స్థానిక సంస్థలను, 558 వార్డులను మాత్రమే గెలుచుకుందని, 22 పట్టణాల్లో ఒక్క వార్డు కూడా గెలవలేకపోయిందని ముఖ్యమంత్రి తెలిపారు.

దీపావళి వేళ ఏపీలో అగ్నిప్రమాదాలు..

వివరాల్లోకి వెళితే, కృష్ణా జిల్లా గన్నవరంలోని ఒక గృహోపకరణాల దుకాణంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో సదరు దుకాణానికి భారీగా ఆస్తి నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలసలో బాణాసంచా కారణంగా ఒక ఆయిల్ గోడౌన్‌లో మంటలు చెలరేగాయి. వేడుకల్లో భాగంగా కాల్చిన తారాజువ్వ నేరుగా గోడౌన్‌పై పడటంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. ఇక గుంటూరు జిల్లా తెనాలిలోని గంగమ్మపేటలో ఉన్న ఒక ఎలక్ట్రిక్ స్కూటర్ల షోరూంలోకి టపాసులు దూసుకెళ్లడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఈ ఘటనలో మూడు ఎలక్ట్రిక్ స్కూటర్లు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. ఈ ప్రధాన ఘటనలే కాకుండా, పండుగ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల చిన్నపాటి అగ్నిప్రమాదాలు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

లోకేశ్ ఆదేశాలతోనే

వైసీపీ నేతలపై తప్పుడు కేసులు: అంబటి రాంబాబు

ఎమ్మెల్సీ తలశిల రఘురాం, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త డైమండ్ బాబు ములాఖత్ ద్వారా పరామర్శించారు. అనంతరం జైలు వెలుపల అంబటి రాంబాబు మీడియాతో మాట్లాడారు. ప్రశాంతంగా ఉండే గుంటూరు జిల్లాలో కూటమి ప్రభుత్వం దుష్ట సంప్రదాయాలకు తెరతీసిందని అంబటి విమర్శించారు. "ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత బస్సులో నుంచి వెంగళాయపాలెం బ్యాలెట్ బాక్స్‌ను కిందకు ఎందుకు దించారు? ఓ చిన్న ఘటనను అడ్డంపెట్టుకుని కేసు నమోదు చేయడం అత్యంత దుర్మార్గం. ఎలాగైనా సరే అప్పిరెడ్డిని జైల్లో పెట్టాలనే ఉద్దేశంతో లోకేశ్, ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ కుట్ర పన్నారు" అని అంబటి ఆరోపించారు. చురుగ్గా పనిచేస్తున్న వైసీపీ నాయకులను లక్ష్యంగా చేసుకుని జైళ్లకు పంపే కుట్రలు జరుగుతున్నాయని, అయితే ఇలాంటి చర్యలకు పార్టీ నేతలు ఎవరూ భయపడబోరని ఆయన స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం బ్యాలెట్ బాక్సు తరలింపు వివాదంలో విధుల నిర్వహణకు ఆటంకం కలిగించారనే ఆరోపణలతో నవంబర్ 6న పోలీసులు అప్పిరెడ్డిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.

పట్నం నరేందర్‌రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేశారు

వికారాబాద్ జిల్లా పరిగి సమీపంలోని బహార్‌పేట్ చౌరస్తా వద్ద పోలీసులు పట్నం నరేందర్‌రెడ్డి వాహనాన్ని అడ్డుకుని ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. ఆయన కోస్గిలో మరణించిన ఓ బీఆర్ఎస్ కార్యకర్త అంత్యక్రియలకు వెళుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఆ ప్రాంతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన ఉన్నందున, ముందస్తు జాగ్రత్త చర్యగానే నరేందర్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు. ఈ అరెస్టుతో ఆగ్రహించిన బీఆర్ఎస్ కార్యకర్తలు పోలీసు వాహనాన్ని చుట్టుముట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై కేటీఆర్ స్పందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "పరామర్శించేందుకు వెళుతున్న నాయకుడిని అరెస్టు చేయాల్సిన అవసరం ఏముంది? బాధిత కుటుంబానికి అండగా నిలవడం కూడా ఇందిరమ్మ రాజ్యంలో నేరమైందా? నిర్బంధాలతో ప్రతిపక్షాలను భయభ్రాంతులకు గురిచేయడమే కాంగ్రెస్ పార్టీ పాలనగా మార్చుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వ కక్షసాధింపు చర్యలకు బీఆర్ఎస్ ఏమాత్రం భయపడదు. ప్రజల, కార్యకర్తల పక్షాన పోరాటం కొనసాగుతుంది. పట్నం నరేందర్‌రెడ్డిని ఎలాంటి షరతులు లేకుండా విడుదల చేయాలి" అని డిమాండ్ చేశారు. మరోవైపు, పట్నం నరేందర్‌రెడ్డి అరెస్టును మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కూడా ఖండించారు. ప్రతిపక్ష నేతలను అకారణంగా నిర్బంధించడం ప్రజాస్వామ్య విరుద్ధమని పార్టీ నేతలు స్పష్టం చేశారు.

ప్రధాని మోదీతో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కీలక ఫోన్ సంభాషణ

రష్యా-ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న యుద్ధ సంక్షోభాన్ని కేవలం చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే పరిష్కరించుకోవాలని భారత ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ సోమవారం సాయంత్రం ప్రధాని మోదీతో టెలిఫోన్‌లో మాట్లాడారు. ఈ సంభాషణకు సంబంధించిన వివరాలను భారత ప్రధానమంత్రి కార్యాలయం అధికారికంగా విడుదల చేసింది. పీఎంఓ ప్రకటన ప్రకారం.. రష్యాతో నెలకొన్న ప్రస్తుత యుద్ధ పరిణామాలపై తన అభిప్రాయాలను అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రధాని మోదీతో పంచుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, సమస్యల పరిష్కారంలో భారత్ ఎల్లప్పుడూ అనుసరించే 'మానవతా దృక్పథాన్ని' (ఎబఝఅ-ఎవఅ-తీఅఎ ఖజూజూతీశీఖఎష్ట్ర) పునరుద్ఘాటించారు. వివాదాలను కేవలం చర్చలు, దౌత్యం ద్వారానే పరిష్కరించుకోవాలనేది భారత్ యొక్క స్థిరమైన విధానమని స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో శాంతిని పునరుద్ధరించేందుకు ఉద్దేశించిన అన్ని రకాల ప్రయత్నాలకు తమ వంతు సహకారం అందించేందుకు భారత్ సిద్ధంగా ఉందని ప్రధాని తెలిపారు. అలాగే, ఇరు దేశాల ప్రజల ప్రయోజనాల దృష్ట్యా వివిధ రంగాలలో భారత్-ఉక్రెయిన్ ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవడంపై కూడా నేతలిద్దరూ చర్చించారు. మరోవైపు, ఈ ఫోన్ సంభాషణపై ఉక్రెయిన్ అధ్యక్ష కార్యాలయం కూడా ఒక ప్రకటన విడుదల చేసింది. యుద్ధాన్ని ముగింపు దశకు తీసుకువచ్చేందుకు అవసరమైన దౌత్య ప్రక్రియలు, తదుపరి చర్యలపై ప్రధాని మోదీతో చర్చించినట్లు పేర్కొంది. రాబోయే అబూదాబీ సమావేశ ఎజెండా కోసం ఉక్రెయిన్ సిద్ధమవుతోందని జెలెన్‌స్కీ తెలిపారు. ఉక్రెయిన్ ఎల్లప్పుడూ నిర్మాణాత్మక వైఖరితోనే ఉందని, రష్యా నుంచి కూడా యుద్ధ ఉద్రిక్తతలను తగ్గించే విధంగా అలాంటి చొరవే అవసరమని ఆయన పేర్కొన్నారు.

2028 నాటికి కొడంగల్ భూములకు కృష్ణా జలాలు

రూ.9,053 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం పరిధిలోని లగచర్ల పారిశ్రామిక పార్కులో ఏర్పాటు చేసిన 'రైతన్నతో ఆత్మీయ సభ'లో సీఎం పాల్గొని ప్రసంగించారు. అంతకుముందు నియోజకవర్గ పరిధిలో రూ.9,053 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలను ఆవిష్కరించారు.

పోలేపల్లి ఎల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు తీసుకున్న అనంతరం రైతులతో కలిసి పాదయాత్రగా సభా ప్రాంగణానికి చేరుకున్నారు.

ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి, మహమ్మద్ అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీ, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌తో పాటు ఎంపీలు, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, రైతులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

దశాబ్దాలుగా పాలమూరుకు అన్యాయం

పాలమూరు ప్రాంతం ఏనాడూ ఆశించిన స్థాయిలో అభివృద్ధికి నోచుకోలేదని సీఎం అన్నారు. ఎంతో మంది నాయకులు వచ్చినా వలసలు ఆగలేదని, ఈ ప్రాంతం పంటలకు నోచుకోలేదని పేర్కొన్నారు.

భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, జూరాల, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులు దశాబ్దాలుగా ముందుకు సాగలేదని అన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాతైనా పరిస్థితుల్లో మార్పు వస్తుందని భావించినా ఆశించిన ప్రయోజనం దక్కలేదని పేర్కొన్నారు. మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని పదేళ్లపాటు పక్కన పెట్టారని ఆరోపించారు.

పరిశ్రమలతో వేలాది ఉద్యోగాలు

అవకాశం వచ్చినప్పుడు పాలమూరు, కొడంగల్ ప్రాంతాన్ని ఎందుకు అభివృద్ధి చేసుకోకూడదని సీఎం ప్రశ్నించారు. కొడంగల్ ప్రాంతంలో వేల కోట్ల రూపాయల పెట్టుబడులతో పరిశ్రమలు రానున్నాయని తెలిపారు. పారిశ్రామిక వాడను అభివృద్ధి చేసి పరిశ్రమలను ఏర్పాటు చేయడం ద్వారా వేలాది మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. రాజేంద్రనగర్ నుంచి చేవెళ్ల, షాబాద్, పరిగి, కొడంగల్ ప్రాంతాలకు రహదారులను అభివృద్ధి చేయడంతో పాటు పరిశ్రమలను కూడా తీసుకురానున్నట్లు వివరించారు. ఒకవైపు గత ప్రభుత్వం చేసిన అప్పులను చెల్లించుకుంటూనే, మరోవైపు తెలంగాణను అభివృద్ధి చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని సీఎం తెలిపారు. ఈ ప్రాంత అభివృద్ధికి ప్రజలు అండగా నిలవాలని కోరారు.

ఆరుతడి పంటలే వేయండి

ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గి తీవ్ర నీటి ఎద్దడి పరిస్థితులు ఏర్పడ్డాయని సీఎం అన్నారు. ప్రస్తుత పరిస్థితులను రైతులు, ప్రజలు అర్థం చేసుకోవాలని సూచించారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని మరోసారి విజ్ఞప్తి చేశారు. ఎల్‌నినో ప్రభావాన్ని అందరం కలిసికట్టుగా ఎదుర్కొందామని పిలుపునిచ్చారు. వచ్చే సంక్రాంతి తర్వాత 'ప్రజాబలం' కార్యక్రమం ద్వారా అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తానని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో సన్నబియ్యం విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సీఎం చెప్పారు. ఒక సీజన్‌లో వరి పంట సాగు చేయకపోయినా ప్రభుత్వం వద్ద తగినంత బియ్యం నిల్వలు ఉన్నాయని తెలిపారు.

పదో తరగతి పరీక్షలకు సిద్ధం కండి. డీఈఓ జనార్దన్ రెడ్డి.



విభారె న్యూస్:- నంద్యాల మార్చి 2027లో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే సాధారణ విద్యార్థులు, గతంలో పరీక్షల్లో తప్పిన విద్యార్థులు పరీక్ష ఫీజులు చెల్లించేందుకు షెడ్యూల్ విడుదల చేసినట్లు నంద్యాల జిల్లా విద్యాశాఖాధికారి పి. జనార్దన్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 11 నుంచి 25వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఫీజులు చెల్లించవచ్చని తెలిపారు. నవంబర్ 26 నుంచి డిసెంబర్ 2 వరకు రూ.50, డిసెంబర్ 3 నుంచి 9 వరకు రూ.200, డిసెంబర్ 10 నుంచి 15 వరకు రూ.500 అపరాధ రుసుముతో ఫీజులు చెల్లించేందుకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. అన్ని సబ్జెక్టులకు రెగ్యులర్ విద్యార్థులు రూ.125, మూడు సబ్జెక్టుల వరకు రూ.110 పరీక్ష ఫీజుగా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఒకేషనల్ విద్యార్థులకు అదనంగా రూ.60, వయోపరిమితి సడలింపు కోరే విద్యార్థులకు రూ.300 రుసుము నిర్ణయించినట్లు వెల్లడించారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల వివరాలను సంబంధిత విద్యా సమాచార పోర్టల్‌లో నమోదు చేసి, ప్రభుత్వ పరీక్షల విభాగం అధికారిక వెబ్‌సైట్ ద్వారా మాత్రమే ఫీజులు చెల్లించాలని సూచించారు. నగదు లేదా బ్యాంకు చలానాల ద్వారా చెల్లింపులు స్వీకరించబడవని స్పష్టం చేశారు. ఫీజు చెల్లింపునకు గడువు పొడిగింపు ఉండదని, విద్యార్థులు నిర్ణీత తేదీల్లోగా ఫీజులు చెల్లించేలా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్ రెడ్డి కోరారు.

శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకున్న నంద్యాల 2 టౌన్ సీఐ సుధాకర్ రెడ్డి.

ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికిన ఈఓ యం.రామకృష్ణ.

ఆశీర్వచన మంటపంలో వేద పండితుల ఆశీర్వాదం.

విభారె న్యూస్:- నంద్యాల జిల్లా పముఖ శైవక్షేత్రమైన పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామంలో వెలిసియున్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానాన్ని నంద్యాల 2 టౌన్ సీఐ

సుధాకర్ రెడ్డి సోమవారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన సీఐ సుధాకర్ రెడ్డికి ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈఓ) యం.రామకృష్ణ, ప్రధాన అర్చకులు కంపమల్ల నారాయణ శర్మ మరియు అధికార సిబ్బంది ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం సీఐ ఆలయంలో శ్రీ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయన పేరిట అర్చనలు, అభిషేకములు, విశేష పూజలు జరిపించారు. దర్శనానంతరం ఆలయంలోని ఆశీర్వ మంటపము నందు సీఐ సుధాకర్ రెడ్డికి వేద పండితులు వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ ఈఓ మరియు సిబ్బంది ఆయనను శేష వస్త్రములతో, పూలమాలలతో ఘనంగా సత్కరించి, స్వామివారి తీర్థప్రసాదాలను, చిత్రపటమును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది మరియు భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా ఉమామహేశ్వరుల పల్లకి సేవ మహోత్సవం

బనగానపల్లె , నవంబర్ 9, విభారె న్యూస్:- మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రం యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో పల్లకి సేవ మహోత్సవం వైభవంగా జరిగింది. సోమవారం యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో ఉమామహేశ్వరుల ఉత్సవ విగ్రహాలకు శాస్త్రోక్తముగా పల్లకి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లను పల్లకి లో ఊరేగింపు నిర్వహించారు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఉమామహేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమములో ఆలయ కార్యనిర్వణ అధికారి పాండురంగారెడ్డి , ఆలయ చైర్మన్ బండి మౌళీశ్వరరెడ్డి ,పాతపాడు మాజీ సర్పంచ్ బెడదల మహేశ్వర రెడ్డి , సభ్యులు తిరుమలయ్య, భరతుడు, జె.సురేష్, మహేష్ రెడ్డి, భక్తులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.









మురసు తుఫానుతో రాష్ట్రవ్యాప్తంగా 1,302 కి.మీ. మేర దెబ్బతిన్న ఆర్ అండ్ బీ రహదారులు- మంత్రి బీసీ

బనగానపల్లె, నవంబర్ 9, విభారె న్యూస్:- మురసు తుఫాను వల్ల రాష్ట్రవ్యాప్తంగా ఆర్ అండ్ బీ శాఖ పరిధిలోని 1,302 కి.మీ. మేర రహదారులు దెబ్బతిన్నాయని రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముసురు తుఫాను వల్ల దెబ్బతిన్న రోడ్లకు తాత్కాలిక పునరుద్ధరణకు రూ.98.70 కోట్లు, శాశ్వత పునరుద్ధరణకు రూ.772.22 కోట్లు అవసరమని అంచనా వేసినట్లు తెలిపారు.



అత్యధికంగా బాపట్ల జిల్లాలో 332 కి.మీ., గుంటూరులో 266 కి.మీ., ఎన్టీఆర్ జిల్లాలో 202 కి.మీ., పశ్చిమగోదావరిలో 122 కి.మీ., పల్నాడులో 93 కి.మీ., ఏలూరులో 75 కి.మీ., తూర్పుగోదావరిలో 68 కి.మీ., నెల్లూరులో 66 కి.మీ., కృష్ణాలో 59 కి.మీ., ప్రకాశం జిల్లాలో 17 కి.మీ. మేర రహదారులు దెబ్బతిన్నాయని తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా 158 చోట్ల రహదారులు కోతకు గురికాగా, 141 చోట్ల పునరుద్ధరణ పనులు పూర్తయ్యాయని తెలిపారు. 31 చోట్ల రహదారులు కొట్టుకుపోగా, 30 చోట్ల పునరుద్ధరించామని, 60 చోట్ల సీడీ వర్క్స్ దెబ్బతినగా 58 చోట్ల పునరుద్ధరణ పనులు చేపట్టామన్నారు. 207 చోట్ల పడిపోయిన చెట్లను పూర్తిగా తొలగించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేశామని, భారీ వర్షాల కారణంగా 120 చోట్ల ట్రాఫిక్ అంతరాయం ఏర్పడగా 116 చోట్ల సమస్యను పరిష్కరించామని తెలిపారు. అధిక వరద ప్రవాహం కారణంగా తూర్పుగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల్లోని నాలుగు ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడిందన్నారు.

తుఫాను కారణంగా దెబ్బతిన్న రహదారుల తాత్కాలిక పునరుద్ధరణకు రూ.98.70 కోట్లు, శాశ్వత ప్రాతిపదికన పునరుద్ధరణకు రూ.772.22 కోట్లు అవసరమవుతాయని ప్రాథమికంగా అంచనా వేసినట్లు మంత్రి తెలిపారు. మొత్తంగా ఆర్ అండ్ బీ శాఖ పరిధిలోని రహదారుల పునరుద్ధరణకు రూ.870.90 కోట్లు వ్యయం అవుతుందన్నారు.

కూటమి విజయాన్ని జీర్ణించుకోలేకే అసత్య ప్రచారాలు: పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

- పాణ్యంలో బనగానపల్లి రాజకీయాలు సాగవు
- ప్రజా తీర్పును గౌరవించాల్సింది పోయి ఎదురుదాడి సరికాదు
- 2029లోనూ కూటమిదే అధికారం: మీడియా సమావేశంలో స్పష్టీకరణ

విభారె న్యూస్:- కర్నూలు ప్రజాస్వామ్యబద్ధంగా జరిగిన ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును ప్రతిపక్షాలు గౌరవించాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి హితవు పలికారు. కూటమి ఘన విజయాన్ని జీర్ణించుకోలేకనే 'గొడ్డలి పార్టీ' నాయకులు నిరాధారమైన అసత్య ప్రచారాలకు దిగుతున్నారని ఆమె తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ.. పాణ్యం నియోజకవర్గంలో బనగానపల్లి తరహా కుట్ర రాజకీయాలు నడవవని స్పష్టం చేశారు. ఇక్కడి ప్రజలు ఎల్లప్పుడూ అభివృద్ధి, సంక్షేమానికే పట్టం కడతారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని తూచా తప్పకుండా నెరవేరుస్తామని, ప్రతిపక్షాలు చేసే రాజకీయ విమర్శలకు తమ అభివృద్ధి పనులతోనే దీటైన సమాధానం చెబుతామని తేల్చిచెప్పారు. కూటమి పాలనపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని చూస్తుంటే 2029 ఎన్నికల్లోనూ కూటమి ప్రభుత్వమే తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కె. పార్వతమ్మతో పాటు పలువురు అర్బన్ వార్డుల కూటమి పార్టీ కార్పొరేటర్లు, వార్డు ఇన్‌ఛార్జులు, ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





తెలుగు గంగ ప్రధాన కాలువకు త్రాగునీరు విడుదల .

రుద్రవరం. విభారె న్యూస్:- రైతులకు ప్రజలకు త్రాగు నీరు అందించాలనే ఉద్దేశంతో వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుండి తెలుగు గంగ ప్రధాన కాలువకు నీటిని గంగ అధికారులు ఆదివారం విడుదల చేశారు. గంగ అధికారులు నీటిని వదలడంతో ప్రధాన కాలువతో పాటు బ్లాక్ చానల్లు పిల్ల కాలువలలో నీరు ప్రవహిస్తోంది. 10 రోజులపాటు గంగ ప్రధాన కాలువకు నీటిని వదులుతున్నట్లు గంగ అధికారులు తెలుపుతున్నారు. వర్షాలు సరిగా పడకపోవడంతో రైతులు సాగుచేసిన పంటలు ఎండు ముఖం పడుతున్న దశలో గంగకు నీటిని విడుదల చేయడంతో ఎండు ముఖం పడుతున్న పంటలకు ఊపిరి పోసినట్లు అయిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గంగ కాలువకు నీటిని విడుదల చేయడంతో పాడి పశువులకు మూగజీవాలకు త్రాగునీటికి ఇబ్బందులు ఉండవని రైతులు తెలుపుతున్నారు. కాలువల్లో నీరు పారడం వల్ల భూగర్భ జలాలు పెరిగి బోరు బావుల్లో నీరు సమృద్ధిగా ఉంటుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.





19 ఉపకాల్వకు గండి. స్పందించిన టీజీపీ చైర్మన్.

రుద్రవరం మండలంలోని అప్పన్నపల్లి గ్రామ సమీపంలోని 19వ ఉపకాలువకు గండి పడింది. గండిపడిన విషయం తెలుసుకున్న టీజీపీ చైర్మన్ సంజీవ్ కుమార్ రెడ్డి వెంటనే స్పందించి యంత్రాల సహాయంతో గండిని పూడ్చి దిగువ రైతులకు త్రాగునీరు అందేలా చర్యలు తీసుకున్నారు. దీంతో రైతులు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు.

నంద్యాల-గాజులపల్లె డబుల్ లైన్ సెక్షన్ ప్రారంభం

మహానంది, విభారె న్యూస్:- మహానంది మండలం ఆర్ఎస్ గాజులపల్లె- నంద్యాల మధ్య ఉన్న 15.121 కిలోమీటర్ల డబుల్-లైన్ సెక్షన్‌ను ప్రారంభించడం జరిగిందని గుంటూరు డివిజన్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ సౌత్ కోస్ట్ రైల్వే జి వి ఎస్ భరత్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రాంతీయ రైలు అనుసంధానానికి, సరుకు రవాణాకు దక్షిణ కోస రైల్వే గంటకు 100 కిలోమీటర్ల అనుమతించదగిన వేగంతో రైళ్ల రాకపోకలకు అధికారం పొందిందన్నారు. 6 కొత్త లూప్ లైన్లు, 3 కొత్త హై-లెవల్ ప్యాసింజర్ ప్లాట్‌ఫారాలు మౌలిక సదుపాయాలు కల్పించారు. మండలంలోని ఆర్ ఎస్ గాజులపల్లె, నందిపల్లిలో ఆధునిక స్టేషన్ భవనాలు నిర్మించారు. ప్లాట్‌ఫారమ్‌లు సజావుగా మారేందుకు ఒక కొత్త ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ ఏర్పాటు చేశారన్నారు. 18 వంతెనలు నిర్మించారు. లైన్ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుతు,రైలు కార్యకలాపాలలో కార్యాచరణ సౌలభ్యాన్ని మెరుగుపరుస్తుంది. నందిపల్లెలో సరుకులను ఎక్కించడానికి,దించడానికి ప్రత్యేకంగా కొత్త ప్లాట్‌ఫారమ్ సౌకర్యం ఏర్పాటు కూడా చేశారు. ఈ కొత్తగా డబుల్ చేసిన సెక్షన్, గుంటూరు--గుంతకల్ డబ్లింగ్ ప్రాజెక్ట్‌లో ముఖ్యమైన మైలురాయిగా నిలోస్తోందన్నారు.



వడ్డీ రహిత సమాజ స్థాపన" నవంబర్ 9-23 పక్షం రోజుల వడ్డీ రహిత సూక్ష్మ ఫైనాన్ ఉద్యమం నంద్యాలలో లాంఛనంగా ప్రారంభించిన సర్వత్ యం.డి ఎగ్బాల్ హుసేన్

విభారె న్యూస్:- నవంబర్ 08, నంద్యాల జిల్లా.



వడ్డీ రహిత సమాజ ధ్యేయంతో 'ఐ సపోర్ట్ ఇంట్రస్ట్ ఫ్రీ మైక్రో ఫైనాన్స్ దేశవ్యాప్తంగా నవంబర్ 9-23 పక్షం రోజుల ఉద్యమాన్ని తేజస్వి హోటల్ మీటింగ్ హాల్ లో సర్వత్ రిసెర్చ్ ఉ డెవెలప్మెంటల్ ఫోండేషన్ ఆధ్వర్యంలో నంద్యాలలో లాంఛనంగా ప్రారంభించారు. కర్నూలు జిల్లా ఖిద్మత్ సొసైటి జిల్లా అధ్యక్షులు చాంద్ బాషా కన్వీనర్ గా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక రాష్ట్రల నుండి 150కు పైగా జిల్లా డైరెక్టర్లు, బ్రాంచి అధ్యక్షులు మేనేజర్లు, ఫిల్డ్ ఆఫీసర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సర్వత్ యం.డి ఎగ్బాల్ హుసేన్ , సిఈఓ ఇగ్బాల్ మొహిద్దీన్ ముంతాజ్, ఆ.ప్ర కోఆర్డినేటర్ ముహమ్మద్ కరీముద్దీన్, వివిధ జిల్లాల అధ్యక్షులు కలిసి ఉద్యమ పోస్టర్ ను ఆవిష్కరించారు. అనంతపూర్ జిల్లా డైరెక్ట్ ముహమ్మద్ యాసీర్ ప్రార్థనతో ప్రారంభమైన ఈ సమావేశంలో ముఖ్య అతిథి ఇగ్బాల్ హుసేన్ మాట్లాడుతూ గత పదిహేను సంవత్సరాల క్రితం ఆ. ప్ర లో ఖిద్మత్, కర్నాటకలో కారుణ్య, తెలంగాణలో సహులత్ పేరుతో ప్రాథమికంగా కొన్ని చోట్ల ప్రయోగాత్మకంగా ప్రారంభించిన వడ్డీ రహిత సొసైటీలు అనతి కాలంలోనే 35 బ్రాంచి లుగా విస్తరించి, లక్షా ముప్పై వేల సభ్యులతో లక్షల టర్నోవర్ తో రానిస్తు వేలమంది పేదవారిని చిన్న వ్యాపారులు తమ కాళ్ళపై నిలదొక్కుకనేలా తోడ్పడుతున్నాయన్నారు. ఈ స్ఫూర్తి, వడ్డీ రహిత సమాజ ధ్యేయం ఇతర రాష్ట్రాలలో ఈ సేవలు మరింతా విస్తరించేందుకు నవంబర్ 9-25 రెండు వారాలు సభ్యులను పెంచుటకు ఉద్యమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్ర కోఆర్డినేటర్ ముహమ్మద్ కరీముద్దీన్ వర్కషాప్ ద్వారా ఉద్యమ సఫలత కోసం తగిన శిక్షణ ఇస్తూ ఉద్యమం అంకితం భావంతో నిర్వహిస్తు వడ్డీ రహిత సమాజ నిర్మాణం పవిత్ర బాధ్యతగా భావించాలని కోరారు. ఇగ్బాల్ మొహిద్దీన్ ముంతాజ్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా బ్యాంకింగ్ సిస్టం వివరించారం. జనాబ్ సిద్దీఖ్ ఖాన్, ఇలియాస్ మన్సూర్ , డైరెక్టర్లు అబ్దుల్ సమద్ ,హాఫీజ్ షోయబ్ జమా, షబ్బీర్ హూసేన్, నంద్యాల సొసైటి అధ్యక్షులు యూనూస్, మేనేజర్ ఫయాజ్, అబ్దుల్లా, అలీం, షఫీ, జమీల్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ శిక్షణలో నంద్యాల విద్యార్థుల సత్తా.. కలెక్టర్ అభినందనలు!

విభారె న్యూస్:-, నవంబర్ 09, నంద్యాల జిల్లా.



నంద్యాల, నవంబర్ 9 : రెడ్ క్రాస్ ప్రెసిడెంట్/ గౌరవ జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియ గారి ఆదేశాల మేరకు అయ్యలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు శ్రీకాకుళం నందు మూడు రోజులు పాటు జరిగిన జూనియర్ రెడ్ క్రాస్ శిక్షణ తరగతుల కార్యక్రమాల్లో పాల్గొన్నారని, నంద్యాల శ్రీరామకృష్ణ డిగ్రీ కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థులు చిత్తూరులో మూడు రోజులు పాటు జరిగిన జరిగిన యూత్ రెడ్ క్రాస్ శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొని రెడ్ క్రాస్ కు సంబంధించిన పలు అంశాల్లో శిక్షణ పొందడం జరిగిందని జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గారు శిక్షణ పొందిన విద్యార్థులతో మాట్లాడి వారు శిక్షణ పొందిన అంశాల గురించి తెలుసుకోవడం జరిగింది.

జిల్లాలో జూనియర్ రెడ్ క్రాస్, యూత్ రెడ్ క్రాస్ విస్తృతపరచడంలో సహకారం అందించాలని జిల్లాలో ఏర్పాటు చేసే జూనియర్, యూత్ క్రాస్ శిబిరాలలో పాల్గొని తోటి విద్యార్థులకు శిక్షణ అంశాలు నేర్పించడంలో తగిన పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా సెక్రెటరీ మరియు జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి వజ్రాల శ్రీకాంత్ రెడ్డి, రెడ్ క్రాస్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉస్మాన్ భాష, రెడ్ క్రాస్ ణఖీూ అబ్దుల్లా, రామక్రిష్ణ డిగ్రీ కళాశాల విద్యార్థులు యూత్ రెడ్ క్రాస్ తరపున రవి కిరణ్, నరసింహా, లక్ష్మీదేవి, స్పందన అయ్యలూరు జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు జూనియర్ రెడ్ క్రాస్ తరపున అస్లాం, అస్రఫ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పౌరుషానికి మరో పేరే 'మాలలు'

● మాలలు ఐక్యమత్యం గా ఉంటే ఏదైనా సాధ్యమే.. ● ఎస్సీ వర్గీకరణలో.. మాలల మౌనమే.. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు వణుకు.. ● మాల మహానాడు నంద్యాల జిల్లా నూతన కమిటీకి ప్రత్యేక అభినందనలు ● మాల మహానాడు రాష్ట్ర గౌరవ అధ్యక్షులు మేకల లింగస్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లం రాజ్ కుమార్.

విభారె న్యూస్:- నవంబరు 09, నంద్యాల జిల్లా. భారతదేశ చరిత్రలో పౌరుషానికి మరో పేరే మాలలని మాల మహానాడు రాష్ట్ర గౌరవ అధ్యక్షులు మేకల లింగస్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లం రాజ్ కుమార్ లు అన్నారు. సోమవారం పట్టణంలోని నూనె పల్లె ప్రాంతంలో నూతన మాల మహానాడు జిల్లా కార్యాలయాన్ని వారు ప్రారంభించి, జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. మాల మహానాడు నంద్యాల జిల్లా అధ్యక్షులుగా గుడిపాల వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు గా కాసరపు రవి, జిల్లా సెక్రటరీ గా దార ఓబులేసు, జిల్లా జనరల్ సెక్రటరీ కేడం సుబ్బారావు, సిరివెళ్ల మండల అధ్యక్షులు మారబత్తుల జయపాల్, సిరివెళ్ల మండల అధ్యక్షురాలు కేడం రామాదేవి, సిరివెళ్ల మండల సెక్రటరీ ఎద్దుల అశోక్, సిరివెళ్ల మండల జనరల్



సెక్రటరీ కాసరపు సురేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాలమహానాడు రాష్ట్ర గౌరవ అధ్యక్షులు మేకల లింగస్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లం రాజకుమారులు మాట్లాడుతూ.. జిల్లా నూతన కమిటీకి ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నామన్నారు. నూతన కమిటీ సభ్యులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయ సిద్ధికి కృషి చేయాలన్నారు, మాలల పై జరుగుతున్న దాడులను, దౌర్జన్యాలను ఎండగట్టాలన్నారు. మాల స్త్రీలపై లైంగిక వేధింపులు, అత్యాచారములను అరికట్టడమే మన సంఘము యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు. మాల ప్రజలకు స్వతహాగా ఉన్న భూములను కబ్జా చేసిన వారిని చట్టపరంగా శిక్ష విధింపచేయుటకు కమిటీ పూర్తిస్థాయి మద్దతు ఇస్తుందన్నారు. గ్రామీణ, పట్టణ స్థాయిలో మాల ప్రజలకు స్మశాన ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. మాలలకు చెందిన అసైన్డ్ భూములను సత్వరముగా వారికి హక్కును కల్పించడం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. వెట్టి కాపురులకు, బెగరులకు ప్రోత్సాహ వేతనమును ఏర్పాటు చేయడం కోసం కృషి చేస్తామన్నారు. మరి ముఖ్యంగా ప్రతి మండల కేంద్రంలో ఒక అంబేద్కర్ భవనం తో, అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు ఈ మాల మహానాడు రాష్ట్ర కమిటీ కృషి చేస్తుందన్నారు. అర్హులైన ప్రతి పేద మాల ప్రజలకు ఇవ్వవలసిన సబ్సిడీ రుణాలు మంజూరు చేయుటకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమం లో మాల మహిళా సేన రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రోజక్క, రాష్ట్ర స్మశాన కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు తలారి నాగరాజు, దళిత సమతా సైనిక దళ్ జిల్లా అధ్యక్షులు అల్వకొండ ప్రేమ కుమార్, జిల్లా మీడియా కో కన్వీనర్ మేకల వెంకటేశ్వర్లు తదితర మాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నంద్యాలలో ఘనంగా ఉర్దూ డే వేడుకలు

విభారె న్యూస్:- నవంబర్ 09, నంద్యాల జిల్లా. ప్రముఖ ఉర్దూ సాహిత్య కవి అల్లామ ఇక్బాల్ జయంతి పురస్కరించుకుని నిర్వహించే "ఉర్దూ డే" కార్వాన్-ఎ-ఉర్ద నంద్యాల జిల్లా అధ్యక్షులు షేక్ అబ్దుల్ సమద్ అధ్యక్షతన నంద్యాల వైఎస్ నగర్ ఉర్దూ హైస్కూల్ లో ఘనంగా నిర్వహించారు. నంద్యాల జిల్లా ఉర్దూ ఉప విద్యాధికారి జనాబ్ హస్ముద్దీన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సంస్థ కన్వీనర్ అబ్దుల్ అజీజ్, హెడ్మాస్టర్ జానీ బాషా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హస్ముద్దీన్ మాట్లాడుతూ ఉర్దూ భాష మాధుర్యాన్ని పంచిన కవి అల్లామ ఇక్బాల్ 'సారే జహాసె అచ్ఛా హిందూస్థా హమారా' నేటికి ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు మతాలకు అతీతంగా ఆలపిస్తారన్నారు. సమద్ మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమంలో ఇక్బాల్ గీతం హిందూ ముస్లీంలు ఐక్యతగా నిలిచిందని నేటికి పాఠశాలలో ప్రార్థన గీతంగా ఆలపించబడుతుందన్నారు. వక్తలు విద్యార్థులు మంచి మార్కులతో రాణించాలని కాంక్షిస్తూ హైస్కూల్ గా అప్గ్రేడ్ చేయటంలో మైనార్టీ శాఖ మంత్రి ఎన్ ఎండి ఫారూఖ్ సేవలను శ్లాఘించారు. వచ్చే సంవత్సరానికి స్కూలులో మినిష్టర్ సహకారంతో బెంచీలం ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం వ్యాస రచన పోటీలో రాణించిన విద్యార్థిని విద్యార్థులకు కార్వానే ఉర్దూ ద్వారా ప్రశంసా పత్రాలు, మెమోంటో బహూకరించారు. ఉపాధ్యాయులు ఖలీలుల్లాకు 2026-27 సంవత్సరానికి గాను ప్రతిష్టాత్మకమైనా "ఉర్దూ రతన్" ప్రధానం చేసారు.



గిద్దలూరు మున్సిపల్ చైర్మన్ కు అభినందనలు తెలిపిన అభిరుచి మధు.



విభారె న్యూస్:- నవంబరు 09నంద్యాల జిల్లా గిద్దలూరు మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన ఎన్డీఏ కూటమి పార్టీ బీజేపీ అభ్యర్థి డాక్టర్ జేవీ నారాయణను భారతీయ జనతా పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అభిరుచి మధు అభినందనలు తెలిపారు. నూతన చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ జేవీ నారాయణ ను స్వయంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ అభిరుచి మధు మాట్లాడుతూ.. గిద్దలూరు మున్సిపాలిటీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి చైర్మన్ డాక్టర్ జేవీ నారాయణ విశేషంగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఎన్డీఏ కూటమి పార్టీ బీజేపీ పక్షాన బరిలో నిలిచి విజయబావుటా ఎగురవేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, రానున్న రోజుల్లో పట్టణ రూపురేఖలు మార్చే దిశగా ఆయన పాలన సాగాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక బీజేపీ, కూటమి పక్షాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామకృష్ణ అటానమస్ డిగ్రీ కళాశాలలో 100% ఉత్తీర్ణత సాధించిన ఎన్‌సీసీ క్యాడేట్స్



నంద్యాల జిల్లా, నవంబర్ 09, విభారె న్యూస్:- నంద్యాల పట్టణం నందు గల శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాలలో ఈరోజు 9(ూ) బెటాలియన్, కర్నూలు నుండి ముగ్గురు ఆర్మీ అధికారులు హవల్దార్ పి.శ్రీనివాస రావు హవల్దార్.యస్.యం.రఫీ , హవల్దార్. గోపి కృష్ణ విచ్చేసి ఎన్‌సీసీ బి సర్టిఫికెట్ సాధించిన క్యాడెట్లకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో మొత్తం 58 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు బి సర్టిఫికెట్ పరీక్షకు హాజరు కాగా, అందరూ కూడా ఉత్తీర్ణత సాధించడం విశేషం. ఉత్తీర్ణులైన క్యాడెట్లకు అధికారులు బి సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల చైర్మన్ డాక్టర్ జి. రామకృష్ణారెడ్డి క్యాడెట్లను ఉద్దేశించి మాట్లాడుతూ, ఎన్‌సీసీ ద్వారా క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి, సేవాభావం అలవడతాయని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు ఎన్‌సీసీలో కూడా రాణించి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ జి. రామకృష్ణారెడ్డి , ప్రిన్సిపాల్ కె.వి.బి. సుబ్బయ్య , ఎన్‌సీసీ అధికారి ఎం. శివరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తీర్ణులైన క్యాడెట్లను కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.

తుఫాన్ డ్రైవర్లపై దాడి.. ప్రైవేట్ ట్రావెల్స్ అక్రమాలపై చర్యలు ఎక్కడ?

విభారె న్యూస్:- నవంబరు 09, నంద్యాల జిల్లా. ఎల్లో బోర్డు ట్యాక్సులు కడుతూ.. వైట్ బోర్డు వాహనాలతో ట్రావెల్స్ వ్యాపారం! ప్రైవేట్ వెహికల్ ఓనర్స్ వైట్ బోర్డు వాహనాలను ట్రావెల్స్‌గా మార్చుతున్నా పట్టించుకోని నంద్యాల అధికారులు.. వెహికల్ ఇన్‌స్పెక్టర్‌పై ప్రశ్నలు! నంద్యాల--కర్నూలు తుఫాన్ డ్రైవర్లపై దాడి ఘటన నేపథ్యంలో ప్రైవేట్ ట్రావెల్స్ వాహనాల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. హలో బోర్డు ట్యాక్సులు కడుతూ, నిబంధనలకు విరుద్ధంగా వైట్ బోర్డు వాహనాలను ట్రావెల్స్‌గా మార్చి నడుపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రైవేట్ వెహికల్ ఓనర్లు వైట్ బోర్డు వాహనాలను ట్రావెల్స్‌గా మార్చి ప్రయాణికులను తరలిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని తుఫాన్ డ్రైవర్లు ఆరోపిస్తున్నారు. నంద్యాల రవాణా శాఖ అధికారులు, వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఈ వ్యవహారంపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఒకవైపు నిబంధనల ప్రకారం ట్యాక్సులు చెల్లిస్తూ జీవనం సాగిస్తున్న తుఫాన్ డ్రైవర్లపై దాడులు జరుగుతుంటే, మరోవైపు నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్న వారిపై చర్యలు తీసుకోకపోవడం ఏమిటని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రవాణా శాఖ అధికారులు స్పందించి వైట్ బోర్డు వాహనాలను ట్రావెల్స్‌గా నడుపుతున్న వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని తుఫాన్ డ్రైవర్లు డిమాండ్ చేస్తున్నారు. తమకు న్యాయం చేయడంతో పాటు అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.





EDITED, PRINTED PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPPTAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL-518001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR: AVULA VIJAYA BHASKARA REDDY. RNI No: APTEL/2019/77190